జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలను అంతేకాకుండా ఆ పార్టీ తెలంగాణ ప్రాంతానికి చెందిన



ఉస్మానియా విశ్వవిద్యాలయం వీసీగా నియమితులైన ప్రొఫెసర్ సత్యనారాయణ

# ఎట్టకేలకు వీసీల నియామకం

**● ఉస్మానియా వీసీగా సత్యనారాయణ ● తెలంగాణకు అక్బర్ అలీ ఖాన్**

**● అంబేద్కర్ వీసీ పదవిలో ప్రకాశ్ ● కొత్త వీసీలు ముగ్గురూ తెలంగాణవారే**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ ముఖ్య ప్రతినిధి:** ఎట్టకేలకు ప్రభుత్వం మూడు విశ్వవిద్యాలయాలకు పూర్తిస్థాయి ఉపకులపతులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గత 15 నెలలుగా ఖాళీగా ఉన్న తెలంగాణ విశ్వవిద్యాలయంతో పాటు ఫిబ్రవరి మాసంలో ఖాళీ అయిన ఉస్మానియా, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయాలకు ఉపకులపతులను నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

అందరూ ఊహించినట్లే ఉస్మానియా విశ్వవిద్యాలయానికి ఇదే విశ్వవిద్యాలయానికి చెందిన రసాయన శాస్త్ర సీనియర్ ప్రొఫెసర్ ఎస్.సత్యనారాయణ ఉపకులపతిగా నియమితులు కాగా, తెలంగాణ విశ్వవిద్యాలయానికి ఉస్మానియా వర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ సీనియర్ ప్రొఫెసర్ అక్బర్ అలీఖాన్ నియమితులయ్యారు. బిఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయానికి యుజిసి అదనపు కార్యదర్శి డాక్టర్ పి.ప్రకాశ్‌ను నియమించారు. ఈ ముగ్గురిలో అక్బర్ అలీ ఖాన్, ప్రకాశ్‌లు కరీంనగర్ జిల్లాకు చెందినవారు కాగా, ఉస్మానియా వర్సిటీ వీసీగా నియమించిన సత్యనారాయణ ఖమ్మం జిల్లా కొత్తగూడెం ప్రాంతానికి చెందినవారు.

ప్రస్తుతం సత్యనారాయణ రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్‌జియుకెటి) రిజిస్ట్రార్‌గా గత రెండేళ్ళుగా పనిచేస్తున్నారు. గతంలో నిజాం కళాశాల ప్రిన్సిపాల్‌గా, అంతకుముందు ఉస్మానియా యూనివర్సిటీ పిజి అడ్మిషన్ల డైరెక్టర్‌గా, అకడమిక్ ఆడిట్ సెల్ జాయింట్ డైరెక్టర్‌గా పనిచేసిన అనుభవం ఉంది. అక్బర్ అలీ ఖాన్, ప్రకాశ్‌లు మాత్రం పాలనాపరమైన అనుభవం లేదని, అయితే ప్రభుత్వం ఒక మైనారిటీ ప్రొఫెసర్‌ను రాష్ట్రంలో ఎక్కడో ఒక దగ్గర నియమించాలన్న సంకల్పంతో అక్బర్ అలీ ఖాన్‌ను ఎంపిక చేసినట్లు సమాచారం. యుజిసిలో పనిచేస్తున్న ప్రకాశ్ గతంలో అనేక కమిటీల్లో పనిచేసిన అనుభవం ఉన్నా రాష్ట్రంలో ఆయన ఎటువంటి పదవిలో కొనసాగలేదు. అయితే బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన వారికి అవకాశం ఇవ్వాలన్న ఉద్దేశ్యంతో ఆయన విద్యార్హతలు, అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని ఉపకులపతిగా నియమించినట్లు ప్రచారం జరుగుతోంది.

వెనకబడిన తరగతుల్లో పెరిక సామాజిక వర్గానికి చెందిన సత్యనారాయణ ఉస్మానియా విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా నియమించడం పట్ల ఈ సామాజికవర్గానికి చెందినవారు సైతం ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. ఉపముఖ్యమంత్రి, ఉన్నత విద్యాశాఖ బాధ్యతలు నిర్వర్తిస్తున్న దామోదర రాజనర్సింహ బడుగు బలహీనవర్గాలకు ఉపకులపతుల నియామకాల్లో పెద్దపీట వేయాలన్న సంకల్పానికి అనుగుణంగా ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి సైతం ఉస్మానియా వర్సిటీకి బీసీ సామాజికవర్గానికి చెందిన వారిని ఎంపిక చేశారని సమాచారం. ఈ వర్సిటీ వీసీ పదవికి మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ తిరుపతిరావు చివరి క్షణం దాకా పోరాడారు. ఆయన పేరు కూడా సెర్చ్ కమిటీ ఎంపిక చేసి గవర్నర్‌కు పంపిన దస్త్రంలో ఉంచింది.

అయితే తిరుపతిరావుకు తిరిగి ప్రాతినిధ్యం లభించడం పట్ల ఉపముఖ్యమంత్రి ఒకింత ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు ఆయనకు ఈ పదవిని ఎటువంటి పరిస్థితుల్లోనూ కట్టబెట్టరాదని నిర్ణయించుకున్నారు. దీంతో సెర్చ్ కమిటీ సమావేశమైన మూడు మాసాల తర్వాత ఉస్మానియా వర్సిటీ వీసీ ఎంపిక నియామకంపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంది. గురువారం రాత్రి ముఖ్యమంత్రి కిరణ్ గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్‌ను కలిసిన సందర్భంలోనే ఈ మూడు వీసీల నియామకానికి సంబంధించిన పేర్లు ఖరారయ్యాయని విశ్వసనీయ సమాచారం. తెలంగాణ వర్సిటీ వీసీ పదవికి ఉస్మానియా వర్సిటీ జర్నలిజం శాఖ సీనియర్ ప్రొఫెసర్ పిఎల్ విశ్వేశ్వర్‌రావు కూడా పోటీ పడ్డారు.

అంబేద్కర్ వర్సిటీ వీసీ రేసులో ఉస్మానియా మాజీ వీసీ సులేమాన్ సిద్ధిఖీతో పాటు అంబేద్కర్ వర్సిటీలో పనిచేస్తున్న మరో సీనియర్ అధ్యాపకుడు ప్రొఫెసర్ వెంకయ్య కూడా తీవ్ర ప్రయత్నం చేశారు. వెంకయ్యకు పదవి దక్కుతుందని అందరూ ఊహిస్తున్న తరుణంలో ఇందుకు విరుద్ధంగా ప్రభుత్వం యుజిసికి చెందిన ప్రకాశ్ పేరును గవర్నర్‌కు సిఫారసు చేసింది. గతంలో అంబేద్కర్ వర్సిటీ వీసీగా సీమాంధ్ర ప్రాంతానికి చెందిన ఓఆర్ రెడ్డి అవకాశం ఇవ్వడంతో ఈ దఫా తెలంగాణ ప్రాంతానికి అందులోనూ బ్రాహ్మణ సామాజికవర్గానికి ప్రభుత్వం అవకాశమిచ్చింది.

**ఉస్మానియా కొత్త వీసీకి సమస్యలతో స్వాగతం**

అనేక సమస్యలతో సతమతమవుతున్న ఉస్మానియా వర్సిటీకి ప్రభుత్వం నూతన ఉపకులపతిని నియమించడం అభినందించదగ్గదే అయినా, కొత్త వీసీ సత్యనారాయణకు మాత్రం విశ్వవిద్యాలయం సమస్యలతో స్వాగతం పలకనుంది. వర్సిటీలో ముఖ్యంగా తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగుతుండడం, ఈ నేపథ్యంలో పరీక్షలను వాయిదా వేసిన సంగతి తెలిసిందే. మరోవైపు బోధనేతర సిబ్బంది ఇటీవల కాలంలో తమ డిమాండ్ల సాధనకు ఆందోళన బాట పట్టారు. వీటన్నింటికి తోడు పీజీ అడ్మిషన్లను నిర్వహించి ప్రవేశాలు పొందిన వారందరికీ హాస్టల్ వసతి ఇవ్వవలసిన అతిపెద్ద సమస్య నూతన వీసీ ముందుంది.

అనుబంధ కళాశాలల్లో ప్రవేశాలు, జాబితాల ఆమోదం, పరీక్షల నిర్వహణ తదితర సమస్యలు కూడా కొత్త వీసీని వెంటాడే అవకాశాలున్నాయి. అన్నింటికన్నా ముందు విశ్వవిద్యాలయంలో పరిశోధనలు ఏనాడో మూలపడ్డాయి. ఒకప్పుడు అంతర్జాతీయంగా ఉస్మానియా వర్సిటీకి మంచి గుర్తింపు ఉండేది. అయితే ఇటీవల కాలంలో జరిగిన పరిణామాల నేపథ్యంలో ఉస్మానియా అంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితులన్నింటినీ కొత్త వీసీ అధిగమిస్తారా లేదా అన్నది వేచి చూడాల్సిందే!

# హమ్మయ్య వీసీ వచ్చారు...



**డిచ్‌పల్లి,జూలై 15(కెఎన్ఎన్):** ఎట్టకేలకు 20 నెలల తర్వాత తెలంగాణ విశ్వవిద్యా లయంనకు రాష్ట్ర ప్రభుత్వం వైస్ చాన్స్‌లర్‌ను నియమించింది. గత 20నెలలుగా తే.యుకు ఇం చార్జీ వీసిలే కొనసాగారు. 2009 నవంబర్ 3న తె.యూ వీసిగా పని చేసిన కాశీరాం పదవి విర మణ పొందడంతో ఇప్పటి వరకు ప్రభుత్వం ఇం చార్జి వైస్ చాన్స్‌లర్‌లనే కొనసాగించింది. ప్రభు త్వం టి.యూ వీసిగా అక్బర్ అలీఖాన్‌ను శుక్ర వారం నియమించింది. పదవి విరమణ పొందిన వైస్ చాన్స్‌లర్ కాశీరాం 2006లో జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ డిగ్రీ కళాశాలలో తె.యూ మొదిట వైస్ చాన్స్‌లర్‌గా పని చేశారు. 2009 నవంబర్ 3న కాశీరాం పదవి విరమణ చేయడంతో కాకతీయ విశ్వవిద్యాలయము వైస్ చాన్స్‌లర్ లింగమూర్తిని ప్రభుత్వం తె.యూకు వీసిగా నియమించింది. ఆయన కూడా 2009 నవంబర్ 3 నుంచి నవంబర్ 7, 2010 వరకు కొనసాగారు. లింగమూర్తి పదవి విరమణ పొందడంతో 2010 నవంబర్ 8న ఉస్మానియా విశ్వవిద్యాలయం వీసి తిరుపతి రావును ప్రభుత్వం టి.యూ ఇంచార్జీ వీసిగా నియమించింది. ఆయన 2011 జనవరి 6న పదవీ విరమణ పొందడంతో 2011 జనవరి 8న పాలమూరు వైస్ చాన్స్‌లర్ గోపాల్‌రెడ్డిని ప్రభుత్వం ఇంచార్జీ వీసిగా నియమిం చింది. గోపాల్‌రెడ్డి ఈ నెల 27న పదవి విరమణ పొంద నున్నారని ప్రభుత్వం రెగ్యు లర్ వైస్ చాన్స్‌లర్‌గా అక్బర్ అలీ ఖాన్‌ను శుక్రవారం నియమించింది. కొత్తగా నియ మించ బడిన వి.సికి పాత సమస్యలు పరిష్కారం అవుతాయని వర్సిటి వర్గాలు భావిస్తున్నాయి.

తెయూ వైస్ చాన్స్‌లర్‌గా

# అక్బర్ అలీఖాన్ నియామకం



**డిచ్‌పల్లి,జూలై 15(కెఎన్ఎన్):** తెలంగాణ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్‌గా అక్బర్ అలీ ఖాన్‌ను శుక్రవారం ప్రభుత్వం నియమించింది. గత 20 నెలలుగా ముగ్గురు ఇన్‌చార్జ్ విసిలుగా లింగమూర్తి, తిరుపతి రావు, గోపాల్‌రెడ్డిలు కొనసాగిన విషయం తెలిసిందే. రెండు రోజుల క్రితం డిప్యూటీ సిఎం , ఉన్నత విద్యా మంత్రి దామోధర రాజనర్సింహా విశ్వవిద్యాలయాలకు వైస్ చాన్స్‌లర్‌లను నియమిస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఇన్‌చార్జ్ వీసిగా ఉన్న గోపాల్‌రెడ్డి ఈ నెల 27న పదవీ విరమణ చేయనున్నారు. తె.యు వైస్ చాన్స్‌లర్‌గా ప్రభుత్వం నియమించిన అక్బర్ అలీఖాన్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో కామర్స్ విభాగం హెడ్‌గా పని చేస్తున్నారు. ఆయనకు 30 సంవత్సరాల పైబడి టీచింగ్‌లో అనుభవం ఉంది. జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో దాదాపు 100 పరిశోధనాత్మక వ్యాసాలు ప్రచురించారు. సినీయర్ విద్యావేత్తగా వివిధ అధికారిక హోదాల్లో ఆయన పని చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి ఆయన విశేష సేవలను అందించారు. అక్బర్ అలీఖాన్ కరీంనగర్ జిల్లాకు చెందిన అప్పటి జిల్లా విద్యాశాఖ డిప్యూటీ డిఇఓ హోష్టార్‌ఖాన్ కుమారుడు ఈ వైస్ చాన్స్‌లర్, ఈయన నవంబర్ 11, 1955లో జన్మించారు. గతంలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో కామర్స్, మేనేజ్‌మెంట్ కళాశాలలో ప్రిన్సిపల్‌గా , పిహెచ్‌డిడి, బిఓఎస్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్‌గా కూడా అక్బర్ అలీఖాన్ పని చేశారు. ఆమెరికాలోని విస్కాన్సిస్ యూనివర్సిటిలో కూడా కామర్స్ సబ్జెక్టులో కొంతకాలం బోధన చేశారు. అక్బర్ అలీఖాన్ శనివారం 11 గంటలకు తెలంగాణ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారని వర్సిటీ వర్గాలు తెలిపాయి.